క్లుప్తంగా

డిష్‌తో ఆన్‌లైన్ విద్యాబోధన



ఆన్‌లైన్ విద్యాబోధనను పరిశీలిస్తున్న హెచ్‌ఎం

కలువాయి: పాఠశాలలో నెట్ సౌకర్యం లేకున్నా విద్యార్థులకు డిష్‌తో ఆన్‌లైన్ విద్యాబోధన అందుబాటులోకి తెచ్చినట్లు కలువాయి జెడ్పీ హైస్కూలు హెచ్‌ఎం అబ్బాస్ ఆలీ తెలిపారు. ఆయన మంగళవారం ఆన్‌లైన్ విద్యాబోధన ఎలా జరుగుతుందన్న విషయం పరిశీలించారు. కేవలం రూ.2 వేల ఖర్చుతో డిష్ ఏర్పాటు చేసుకుంటే మన ఇంట్లో అయినా టీవీలో పాఠాలు వినవచ్చన్నారు. ఒకటో తరగతి నుంచి 12వ తరగతి వరకు, అలాగే ఉన్నత విద్యా కార్యక్రమాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతులను అందుబాటులోకి తెచ్చిన హెచ్‌ఎం అబ్బాస్ ఆలీని ఎంఈఓలు బాలకృష్ణారెడ్డి, శేషగిరిరావు, ఉపాధ్యాయులు, విద్యాకమిటీ సభ్యులు అభినందించారు.

నరాల వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ బిందుమీనన్

రాపూరు: నరాల వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని న్యూరాలజిస్ట్ బిందుమీనన్ పేర్కొన్నారు. రాపూరు మండలం వేపినాపి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం వైద్యసిబ్బందికి మూర్ఛ, పక్షవాతం, నరాల వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నరాల బలహీనతతో బ్రెయిన్ స్ట్రోక్, మూర్ఛ, పక్షవాతం వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఉప్పు వాడకం తగ్గించాలన్నారు. ఉప్పు అధికంగా తీసుకోవడంతో బీపీ పెరుగుతుందని, దీంతో నరాలు దెబ్బతినే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు షాలిని, సూర్యధర్మేంద్ర, సుదర్శనమ్మ, రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

నిమ్మలో సస్యరక్షణ అవసరం



నిమ్మ చెట్లను పరిశీలిస్తున్న కార్తీక్

గూడూరురూరల్: నిమ్మ పంటకు రసం పీల్చే పురుగు సోకిందని, సస్యరక్షణ చర్యలు చేపట్టి, దీన్ని నివారించుకోవాల్సిన అవసరం ఉందని ఉద్యానవనశాఖాధికారి కార్తీక్ సూచించారు. పారిచెర్లలోని నిమ్మ తోటలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నిమ్మ చెట్లలో చిగుర్లకు జిడ్డు అంటుకుని ముడతలు వస్తుందని, దీని నివారణకు మందు వాడాలని సూచించారు. సైయాంటినిలిప్రోల్, థైయామితాక్సమ్‌ను ఉద్యాన శాఖాధికారుల సూచన మేరకు చెట్లపై పిచికారి చేసుకోవాలన్నారు. ఆయన వెంట వీఏఏ శివ ఉన్నారు.

అవగాహన కల్పించాలి



సామాజిక తనిఖీలో పాల్గొన్న అధికారులు

సూళ్లూరుపేట రూరల్: ఉపాధి హామీ పనులపై ప్రజలకు అవగాహన కల్పించాలని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. సూళ్లూరుపేట మండల పరిషత్ కార్యాలయంలో 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు మండలంలో రూ. 8.24 కోట్లతో చేపట్టిన ఎన్‌ఆర్‌జీఎస్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్ , సచివాలయాల నిర్మాణం తదితర అభివృద్ధి పనులపై మంగళవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. అన్ని పనుల రికార్డులపై కుణ్ణంగా పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉపాధి హామి పనులపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీవీఓ భాగ్యలక్ష్మి, ఏపీడీ రవినాయుడు, అంబుడ్స్‌మన్ రాసరాయుడు, ఎంపీడీఓ చంద్రమౌళి, ఏపీఓ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

9న చెరువుల్లో చేపల వేలం

కలువాయి: మండలంలోని వెరుబొట్లపల్లె, కనుపూరుపల్లె చెరువుల్లో చేపలు పట్టుకునేందుకు 9వ తేదీన వేలం పాటలు నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి బి.విరిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెరుబొట్లపల్లె సచివాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు వేలం పాటలు జరుగుతాయన్నారు. కనుపూరుపల్లె పీడబ్ల్యూడీ చెరువుకు రూ.55 వేలు, వెరుబొట్లపల్లె రెడ్ల చెరువుకు రూ.15 వేలు మద్దతు ధరగా నిర్ణయించామన్నారు. ఆసక్తి ఉన్న వారు రూ.5 వేలు ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొన వచ్చన్నారు.

కండలేరులో 11.593 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 11.593 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగ కాలువకు 260 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, హైలెవలల్ కాలువకు 70, లోలెవల్ కాలువకు 360 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు.

విజయదీపిక.. ఫలితం పదిలమిక



హెచ్‌ఎంలకు విజయ దీపిక పుస్తకాలను అందజేస్తున్న ఎంపీపీ వెంకటరమణమ్మ (ఫైల్)



విజయదీపిక పుస్తకాలను చూపుతున్న విద్యార్థులు

పది విద్యార్థుల భవితకు తొలిమెట్టు. ఉత్తమ ఫలితంతోనే ఉన్నత విద్యకు బంగారు బాట.. అయితే పరీక్షలంటేనే చిన్నారుల్లో ఒత్తిడి, భయం, ఆందోళన.. వీటిని జయిస్తేనే మనుగడ. వీటి నుంచి పిల్లలను గట్టెక్కించాలని ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిషత్ భావించింది. అందుకు సులభరీతిలో చదువుకునేందుకు వీలుగా విజయదీపికలను రూపొందించింది. విద్యార్థుల విజయానికి తోడ్పడింది. దీనిపై ప్రత్యేక కథనం.

- జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో పుస్తకాల పంపిణీ
- ఇంగ్లీషు, తెలుగు మీడియంలో ప్రచురణ

చిల్లకూరు: పదో తరగతి పరీక్షలంటేనే విద్యార్థుల గుండెల్లో గుబులు మొదలవుతుంది. ఏమి చదవాలి..ఎలా చదవాలన్న భయం వెంటాడుతుంది. వీటికి పరిష్కారమే విజయదీపిక పుస్తకం. దివంగత నేత వైఎస్సార్ పాలనలో అప్పటి నెల్లూరు జెడ్పీ చైర్మన్ కాకాణి గోవర్ధనరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు పరీక్షల సమయంలో సులభరీతిలో ప్రశ్నలు, సమాధానాలు ఉండేలా విజయదీపిక పుస్తకాలను ముద్రించి, అందజేశారు. నేటికీ ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో ప్రస్తుత జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ కూడా ఆ ఆనవాయితీని కొనసాగిస్తూ జెడ్పీ హైస్కూళ్ల విద్యార్థులకు ఇంగ్లీషు, తెలుగు మీడియంలో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో తయారు చేయించి, ముద్రించిన విజయదీపికలను అందజేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో పెను మార్పులు తీసుకువస్తున్న క్రమంలో విద్యార్థులకు తమ వంతు తోడ్పాటు ఇవ్వాలని ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిషత్ ఈ ఆలోచన చేసి, విజయ దీపికలను అందిస్తోంది. రెండు నెలలో పరీక్షలు ప్రారంభం కానుండడంతో ప్రతి విద్యార్థికీ విజయ దీపికలను అందించేలా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా గూడూరు డివిజన్‌లోని అన్ని మండలాలలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ఇంగ్లీషు, తెలుగు మీడియంలో విజయ దీపిక పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ పుస్తకాల్లో ప్రతి పాఠ్యాంశానికి సంబంధించి ప్రశ్నలు, జవాబులున్నాయి. ఈ పుస్తకాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతున్నాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

మండలం	పాఠశాల సంఖ్య	విజయ దీపికలు
గూడూరు	9	437
చిల్లకూరు	9	352
కోట	8	389
వాకాడు	6	232
చిట్టమూరు	9	366

అర్థమయ్యే రీతిలో ఉన్నాయి



పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతున్నాయంటేనే ఓ విధమైన భయం ఆవరిస్తుంది. నేడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకుని వచ్చిన ఆన్‌లైన్ క్లాసుల ద్వారా సందేహాలను నివృత్తి చేసుకుని, కొంత భయాన్ని పోగొట్టుకున్నాం. దీనికితోడు జిల్లా పరిషత్ ద్వారా ఉచితంగా అందించిన విజయదీపిక పుస్తకాలలో సులభరీతిలో ప్రశ్నలు, జవాబులు అర్థమయ్యే రీతిలో ఉండడంతో మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. ఇప్పుడు పరీక్షలు అంటే భయం పోయింది. 100కు 100 మార్కులు సాధించగలనన్న దీమా వస్తోంది.

- జడపల్లి చరణ్, ఇంగ్లీషు మీడియం విద్యార్థి, చిల్లకూరు

విజయదీపిక బాగుంది



జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో మాకు అందజేసిన విజయదీపిక పుస్తకం బాగుంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన వసతులు కల్పించడంతో పాటుగా ఇంగ్లీషు మీడియం ప్రవేశ పెట్టి కార్పొరేట్ స్థాయిలో బోధన చేయిస్తున్నారు. దీనికితోడు తెలుగు, ఇంగ్లీషు మీడియం విద్యార్థులకు జిల్లా పరిషత్ ద్వారా జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని విజయదీపికలను అందించే ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉంది. దీని ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించగలం.

- కన్నా రక్షిత, ఇంగ్లీషు మీడియం విద్యార్థిని, చిల్లకూరు

ఎంతగానో ఉపయోపడతాయి



పదో తగరతి విద్యార్థులకు పరీక్షల్లో భయం పోగొట్టేలా జిల్లా పరిషత్ ద్వారా ప్రతి ఏడాది విజయ దీపిక పుస్తాకాలు అందించడం ఎంతో అబినందనీయం. నిష్ణాతులైన ఉపాధ్యాయులతో రూపొందించిన విజయదీపిక పుస్తకాలు విద్యార్థులకు ఎంతోగానో ఉపయోపడుతున్నాయి. విజయదీపిక పుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటే ఉత్తమ ఫలితాలు సాధించడానికి అవకాశాలు మెండుగా ఉంటాయి.

- శివసుబ్రహ్మణ్యం, హెచ్‌ఎం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చింతవరం

ప్రభుత్వ భూములు కాపాడండి



డిప్యూటీ తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, కౌన్సిలర్లు

సైదాపురం(వెంకటగిరి): పట్టణంలోని ప్రభుత్వ భూములు ప్రైవేటు వ్యక్తుల పరమవుతున్నాయని, అవి అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ కోరారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వెంకటరామయ్య, రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌కు ఈ మేరకు వినతిపత్రాలు అందజేశారు. ఆమె మాట్లాడుతూ పట్టణంలోని త్రిభువని సెంటర్ సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమవుతున్నట్లు తెలిపారు. దీనిపై తక్షణమే విచారణ జరిపించి అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ బాలయ్య, విప్ లక్ష్మి, కౌన్సిలర్లు నారాయణ, ప్రభావతి, కళ్యాణి, శంకరయ్య, విజయలక్ష్మి, వహిద, వైఎస్సార్‌సీపీ నేతలు మురళీ, పి శ్రీను, చెంచయ్య తదితరులుపాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ న్యాయం



ఎస్టీలతో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

డక్కిలి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల సర్కారు అని, ప్రతి ఒక్కరికీ న్యాయం చేకూరుతోందని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మోపూరురోడ్డు సెంటర్‌కు చెందిన ఎస్టీలు నక్కల కాలనీ వాసులు, ఎరుకుల, గిరిజన కులాలకు చెందిన పలువురు ఏపీ ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని వెంకటగిరిలోని ఆయన నివాసంలో కలిసి, తమ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. తమ గ్రామంలో సర్వే నంబర్ ఒకటిలో ఉన్న పశువుల మేత పొరంబోకు భూమిని భూములు లేని పేదలకు పంపిణీ చేయాలని, అలాగే సాగు భూములకు పట్టాలు మంజూరు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మీ సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తానని, తనకు కొంత సమయం ఇవ్వాలని కోరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, దివంగత నేత వైఎస్సార్ తరహాలో సుపరిపాలన అందిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పేదలకు పలు సంక్షేమ పథకాలు అందించారన్నారు. వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామానారాయణరెడ్డి అభివృద్ధి అడ్డుకున్నారన్నారు. ఇకపై అలా కాకుండా తాను దగ్గరుండి, అందరీ సమస్యలను పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామన్నారు. తనకు అబద్దాలు చెప్పడం చేత కాదని, ఉన్నదే ఉన్నట్లుగా చెబుతానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీ ప్రజా సంఘాల నాయకులు జీ మునెయ్య, డీ కృష్ణ, గిరిజన సంఘం నాయకులు చిరంజీవి, వెంకటాద్రి పాల్గొన్నారు.

రాంబాబుకు నేదురుమల్లి పరామర్శ

డక్కిలి(బాలాయపల్లె): సింగిల్ విండో అధ్యక్షుడు పీ రాంబా బు నాయుడు, ఆయన కుటుంబ సభ్యులను మంగళవారం వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పరామర్శించారు. రాంబాబునాయుడు అత్త తాళ్లూరు సుబ్బమ్మ ఇటీవల మృతి చెందారు. ఈనేపథ్యంలో రామ్‌కుమార్‌రెడ్డి బాలాయపల్లెకు వెళ్లి రాంబాబును పరామర్శించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీన ర్ కార్తీక్‌రెడ్డి, మహిళా అధికార ప్రతినిధి దేవికాచౌదరి, వెంగమాంబపురం సర్పంచ్ బీ వెంకటసుబ్బయ్య, రమేష్‌నాయుడు, డక్కిలి జేసీఎస్ మండల ఇన్‌చార్జి సీహెచ్ శ్రీనివాసులురెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షులు పీ దశరథరామిరెడ్డి, బీ భాస్కర్‌నాయుడు తదితరులు ఉన్నారు.

ఇళ్లస్థలాల పంపిణీకి కృషి

వెంకటగిరిరూరల్: పట్టణంలోని అర్హులైన భవన కార్మికులు, టైలర్లకు ఇళ్ల స్థలాలు పంపిణీకి తన వంతు కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. టైలర్లు, భవన నిర్మాణ కార్మికులు తమకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని మంగళవారం వినతిపత్రం సమర్పించారు. దీనిపై స్పందించిన ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి స్థానిక సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

వెంకటగిరిరూరల్: పంట సాగు చేస్తున్న రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏడీఏ నాగార్జునసాగర్ పేర్కొన్నారు. మండలంలోని వల్లివేడులో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలో ఎరువు, పురుగు మందుల వినియోగంలో యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వరప్రసాద్, ఏఓ సుజాత, ఏఈఓ రామ్మోహన్, వీఏఏలు భాస్కర్, శ్రీప్రియ, సుమతి, రాజ్యలక్ష్మి, శివకుమార్, రైతులు తదితులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సంపూర్ణ ఆరోగ్యం



పెళ్లకూరు: నెలబల్లిలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు



దొరవారిసత్రం: రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

పెళ్లకూరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఎంపీపీ శేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నెలబల్లి జెడ్పీ హైస్కూలు ప్రాంగణంలో జరిగిన జగనన్న సురక్ష శిబిరానికి పలు గ్రామాల నుంచి వ్యాధిగ్రస్తులు విచ్చేసి పరీక్షలు చేయించుకుని, వైద్యసేవలు పొందారు. జెడ్పీటీసీ సభ్యురాలు నన్నం ప్రిస్కిల్లా, ఎంపీడీఓ సురేష్‌బాబు, డాక్టర్ ఉమ, డాక్టర్ సుజాత,కార్యదర్శి మధుమోహన్ పాల్గొన్నారు.

వేణుంబాకంలో..

దొరవారిసత్రం: మండలంలోని వేణుంబాకం వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లో మంగళవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైద్య శిబిరంలో వివిధ గ్రామాలకు చెందిన రోగులు పరీక్షలు చేయించుకుని మందులు తీసుకున్నారు. దృష్టి లోపం ఉన్న వారికి పరీక్షలు చేసి, కంటి అద్దాల కోసం ప్రతిపాదనలు పంపారు. వైస్ ఎంపీపీ గోపాల్‌రెడ్డి, ఏఓ రఘురామయ్య, వైద్యాధికారి చైతన్య, డాక్టర్లు స్టీఫెన్, నవీన్ పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం' నేడు

చిల్లకూరు: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం రెండో విడతగా చేపడుతున్నామని ఎంపీడీఓ భానుమూర్తి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ గతంలో ఒకసారి జగనన్నకు చెబుదాం కార్యక్రమం చేపట్టి, పలు సమస్యలు పరిష్కరించినట్లు తెలిపారు. అలాగే రెండో విడతలో కూడా జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజలు పాల్గొని, వారి సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం



పారిశుద్ధ్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న కమిషనర్

గూడూరురూరల్: పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగునకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. పట్టణంలోని పలు వీధుల్లో పురపాలక సిబ్బంది చేపడుతున్న పారిశుద్ధ్య పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ఎక్కడ పడితే అక్కడ చెత్తను వేయకుండా పట్టణ ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. అలాగే ఇంటి వద్దకు చెత్త బండ్లు వచ్చిన సమయంలో సకాలంలో వారికి చెత్తను అందించి సహకరించాలని పట్టణ ప్రజలను కోరారు.

మాతమ్మ ఆలయంలో చోరీ

సైదాపురం: మండల కేంద్రంలోని అరుంధతీయవాడలో ఉన్న మాతమ్మ ఆలయంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హుండీ పగలగొట్టి అందులో ఉన్న నగదు చోరీ చేశారు. అలాగే మాతమ్మకు ఉన్న వెండి కళ్లను కూడా అపహరించినట్లు ఆలయ పెద్దలు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ విజయ్‌కుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించి, విచారణ చేపట్టారు.

సెజ్ అభివృద్ధికి ఎనలేని సహకారం

నాయుడుపేటటౌన్: మండలంలోని మేనకూరు సెజ్ అభివృద్ధికి దివంగత మహానేత వైఎస్సార్‌తోపాటు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎంతో సహకారం అందించారని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి సుధాకర్‌రెడ్డి అన్నారు. మేనకూరులోని వైఎస్సార్ స్మృతివనం వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మేనకూరు సెజ్ అభివృద్ధికి కృషి చేసిన వైఎస్సార్‌ని ప్రతి ఒక్కరు స్మరించుకునేలా సుమారు రూ.1.50 కోట్లతో వైఎస్సార్ స్మృతి వనం అందంగా తీర్చిదిద్దామన్నారు. వీటిని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఇటీవల ప్రారంభించారన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మేనకూరు పర్యటన విజయవంతానికి సహకరించిన ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వెంకటరమణారెడ్డి, కమలాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్‌తో పూర్తి హక్కులు



చిల్లకూరు: హక్కుపత్రాలు అందజేస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు



సైదాపురం: పత్రాలు అందజేస్తున్న అధికారులు

చిల్లకూరు: పేదలకు పంపిణీ చేసిన ఇళ్లస్థలాల పట్టాలను లబ్ధిదారుల పేరుతో రిజిస్ట్రేషన్ చేయడంతో మహిళలకు పూర్తి హక్కులు వస్తున్నాయని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం మండలంలోని నెలబల్లిరెట్టపల్లె సచివాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా అర్హులందరికీ ఇళ్లస్థలాలు పంపిణీ చేశారన్నారు. వాటిపై హక్కులు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుని రిజిస్ట్రేషన్ చేసి, ఇస్తుందన్నారు. అనంతరం లబ్ధిదారులకు తహసీల్దార్ హక్కుపత్రాలు పంపిణీ చేశారు.

రిజిస్ట్రేషన్ పత్రాల అందజేత...

సైదాపురం: జగనన్న కాలనీల్లో ప్రభుత్వం పేదలకు మంజూరు చేసిన ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ మండలంలో వేగంగా కొనసాగుతోంది. మంగళవారం స్థానిక సచివాలయంలో లబ్ధిదారుల పేరిట ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్ చేయించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి శశిఇంద్రాణి, వీఆర్వో హైమావతి ఆధ్వర్యంలో లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్ పవన్, వెల్ఫేర్ అసిస్టెంట్ సిద్ధయ్య, ఇంజినీరింగ్ అసిస్టెంట్ నరేష్ పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



సీతారాములు కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

చిల్లకూరు: మండలంలోని వరగలిలో ఉన్న కోదండరామస్వామి ఆలయం ఆవరణలో సోమవారం రాత్రి సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ధర్మప్రచారరథం గ్రామంలో ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద శాస్త్రోక్తంగా సీతారాముల కల్యాణం నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. తమ్మినపట్నంలోని కోదండరామస్వామి ఆలయ ఈఓ జానకి మాట్లాడుతూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో మండలంలోని ఐదు గ్రామాలను ఎంపిక చేసి, సీతారాములు కల్యాణం నిర్వహించడం అభినందనీయమన్నారు. రెండు రోజులు పాటుగా గుమ్మళ్లదిబ్బ మత్స్యకార కాలనీల్లో సీతారాముల కల్యాణం నిర్వహించినట్లు తెలిపారు.